కథాకాలం : 1979

# వానల్లు కురవాలి !

"వానల్లు కురవాలి వానదేవుడా! వరిచేలు పండాలి వానదేవుడా!" పాడుతున్నారు పిల్లలు ఆకలిని మరచి.

"బాలవాక్కు బ్రహ్మవాక్కన్నారు. పిలగాళ్ళ ముచ్చట తీర్చడాని కన్నా ఆ వానదేవుడు కనికరించరాదా!" అనుకున్నాడు ముత్యాలు.

సరిగ్గా వానలుపడి తీరాల్సిన కాలం. నేల తల్లి ఆసలంటూ తడిసి నాలుగు రోజులయింది. ఊడ్పిళ్లు ఆగిపోయాయి. నారుమళ్ళు ఎండి పోతున్నాయి. కూలి దొరకక ముత్యాలు ఆశలూ ఎండి రాలి పోతున్నాయి.

"చెరువింకా యెండిపోలేదు" అంటూ కన్నమ్మ గేలం అందించింది.

"పెసిడెంటుగోరు నిన్ననే సెరువు తోడించి సేపలు పట్టించారే" అన్నాడు ముత్యాలు.

"నాలుగు చేదుబరిగెలు దొరక్కపోవు" అంటూ కన్నమ్మ మాటలతో తరిమింది మొగుణ్ణి.

గేలం భుజాన వేసుకుని చెరువుదిక్కు బయల్దేరాడు ముత్యాలు.

పిల్లలు మరీ శివాలెత్తినట్లు అరుస్తున్నారు "వానల్లు కురవాలి వరిచేలు పండాలి. వాన దేవుడా. వానదేవుడా!"

ముత్యాలు చెట్టుకింద ఆగి పొలాలని శవాల గుట్టలకేసి చూసినట్లు చూశాడు. ఆ పొలాల ఆర్తనాదం గుండెలకు సోకింది· కాబోలు— కళ్ళు తుడుచుకున్నాడు.

ఈ పొలాలు కళకళలాడితే యీ పాటికి చేతినిండా పనే. ఇటు తనూ అటు పెళ్లాం పిల్లలూ ఎవరికి తగ్గ కూలి వాళ్ల సంపాదిస్తే కోమటికొట్లో అరువైనా పుట్టి నోటికి చెయ్యి అందేది.

ఇపుడు వానలు సరిగా పడక ఆర్చుకు పోయిన పొలాలలాగే ఉంది బతుకు.

ఉన్నదల్లా ఆకలి.

లేనిదల్లా కూలి.

మళ్ళీ గేలం భుజాని కెత్తుకుని చెరువువైపు నడక సాగించాడు.

గేలం అవసరం లేకపోయింది.

ఎండిన చెరువులో బురద తప్ప ఏమీ లేదు. చచ్చిన చేప విత్తులు నల్లగా అట్టకట్టిన బురదమీద పగిలిన గాజు పెంకుల్లా మెరుస్తున్నాయి.

ఏదో నీడ పడింది తనమీద.

తలెత్తి చూశాడు. తబ్బిబ్బయిపోయాడు.

"దండాలండి" అన్నాడు ఒదిగి ఉండే బతుకు నేర్పిన వినయాన్నంతా చేతులమధ్య దాచుకొన్నట్టు.

"ఓసారి ఇంటికి రారా సన్నాసి. కాస్త గడ్డిమేటు సర్దుదువుగాని. అందులో పాము దూరిందిట. దొడ్లో తిరగటానికి పిల్లలు భయపడు తున్నారు" మాటల్లో ఏమాత్రం మర్యాద ధ్వనించకుండా జాగ్రత్త పడుతూ ప్రెసిడెంటు హోదాతో పురమాయించాడు వీర్రాజు.

పాము పేరు వినగానే ముత్యాలు భయపడిపోయాడా? లేదు లేదు—

ఆ సమయంలో అక్కడ కనిపించినది ప్రెసిడెంటు వీర్రాజు రూపంలో వచ్చిన దేముడు. ఆరోజు ప్రెసిడెంటు వీర్రాజుగారి దొడ్లో గడ్డిమేట్లో దూరిన పాము దేముడు చూపించిన తరుణోపాయం, తన భాషలో ఆనందపడ్డాడు ముత్యాలు—లేకపోతే రూపాయి డబ్బులు సంపాదించే మార్గం యేదీ?

అందుకే "సిత్తవండి" అన్నాడు తన సంతోషాన్నీ, మర్యాదనీ జాగ్రత్తగా ఆ మాటతో పలికిస్తూ.

ముత్యాలు యిల్లు సందడిగా ఉంది. లోపల పొయ్యి మీదికి గిన్నె ఎక్కింది మొత్తానికి. కన్నమ్మ ఇనపగొట్టంతో పొయ్యి ఊదుతుంటే, పొయ్యి మండుతూ చిటపట మంటుంటే, ఆపైన కుండలో చేపల ఇగురు ఆర్భాటంగా మరుగుతోంది. ఆ చప్పుడు పిల్లలకి కర్ణపేయంగా వుంది. ఈసారి గెంతటం లేదు. అమ్మ పిలుపుకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. కాస్సేపట్లో కంచంనిండా ఇగురు, అందులో తడిసిన మెతుకులూ గొంతుకలో పోసుకోబోతున్నామన్న హుషారు వాళ్ళ కళ్ళలో మెరుస్తోంది. గుడ్డి దీపం వెలుగు ఆ మెరుపుకి కసింత తళుకు నిచ్చింది.

ముత్యాలు ఓ అరకాయి బిగించాడు. పక్క మధ్య చుట్ట బిగించాడు. మన్ పసందుగా నెత్తికి తలపాగా బిగించాడు. చెట్టుకింద గొంతుక్కూచుని ఆ రోజు ప్రెసిడెంటుగారింట్లో గడ్డిమేటు తిరగదోడి పట్టుకున్న బారెడు నల్లత్రాచు గురించి అడిగినవాళ్ళకీ, అడగని వాళ్ళకీ వర్ణించి చెబుతున్నాడు. పాముని ప్రాణానికి తెగించి చంపి, గడ్డిమేటుని ఓ పూటంతా సర్దినందుకు ప్రెసిడెంటుగారిచ్చిన మూడురూపాయల కూలీ, ప్రెసిడెంటుగారికి తెలియకుండా ఆయన భార్య యిచ్చిన బహుమతి (గిన్నెడు అన్నం రెండు ఉప్పు చేపలు) గురించి గూడెం వాళ్ళకి గొప్పగా చెప్పుకుంటున్నాడు.

అంతలో కన్నమ్మనించి పిలుపొచ్చింది కూడు తిండానికి.

పిల్లలు జర్మన్ సిల్వర్ గిన్నె చుట్టూ కూచుని ఇంచుమించు దానిమీద కలబడ్డట్టే తింటున్నారు.

"పెద్దోళ్ళ కష్టాలు పెద్దోళ్ళయేనే!" అంటూ తనకోసం వేరే కేటాయించిన కంచం ముందు కూచున్నాడు ముత్యాలు.

"పెద్దోళ్ళకేటొచ్చిందిప్పుడు కష్టం?" అంటూ చేపల ఇగురు కొబ్బరి చిప్పలో పోసి మొగుడి కందేలా పెట్టింది కన్నమ్మ.

"ఈ ఏడు వానలు కురకపోతే ప్రెసిడెంటుగోరి అమ్మాయి పెళ్ళాగిపోద్దంట—అమ్మగారియ్యాల చెప్పారు" అన్నాడు ముత్యాలు, "అమ్మగారు కష్టం నాతో చెప్పుకున్నారు." అనే గొప్ప ఒలికిస్తూ.

"రామ, రామ, అదేంటలాగ?" ప్రెసిడెంటుగారి కుటుంబానికొచ్చిన కష్టం గురించి కన్నమ్మ మాట వరస కదిగింది.

"ప్రెసిడెంటుగారి దగ్గరిప్పుడు నగదేమీ లేదుగదా! అదంతా ఎరువుల పంపిణీ యాపారంలో మదుపెట్టేసారు. సమయానికి వానలు పడకపోతే—ఈ ఏడు పంటలు సేతికందవ్. దాంతో కాబోయే అల్లుడికి కట్నం డబ్బులు ముప్పైవేలూ పలకవ్!"

"అల్లకేం, గొప్పోల్లు, వానలు పడి పంటలు పండేదాగా లగ్గం ముచ్చటాగుద్దా ఎక్కడో అప్పు పుట్టిస్తారే."

"అది కూడా ఈల్లేదంట ఈపాలి. కొడుకును డాకటేరు సదివించారు గదా!? అస్పటేలు పెట్టానికి ఆరవైవేలు కరుసయిందంట. పంటలు పండకపోతే అప్పు మాత్రం ఎవరిస్తారు?"

"బాగుందయ్యో! అల్ల మంచి చెడ్డల గురించి నువ్వింతగా ఆలోచించాలా? అల్లే యేదో అపాయింకో ఉపాయం ఆలోచించుకుంటారు." అంది కన్నమ్మ మందలింపుగా.

''ఎర్రిమొగమా! అల్లు సల్లగుంటేనే కదే మనం సక్కగుండేది?''

''మనం సల్లగా లేకపోయినా అల్లు సల్లగానే వుంటార్లే....యిక తొంగో పొద్దోయింది.''

కన్నమ్మ దీపం వత్తి చిన్నదిచేసి, గిన్నె దగ్గరే నిద్రపోయిన పిల్లలు ముగ్గుర్నీ లేపి అరుబైటికి దారితీసింది.

పచ్చి ఇటికెలు గోడలుగా పేర్చిన ఇల్లది. ఆ పైన కొబ్బరాకులతో నేసిన కప్పు. ఆ వొంటి గది యింట్లో ఉన్నది ఆరడుగుల స్థలమే.

అందుచేత ముత్యాలు లోపల పడుకొంటే పిల్లలు బైట పడుకొంటారు. కన్నమ్మ ఓ రాత్రివరకూ, బైట పిల్లల దగ్గిరా, ఆ తరవాత లోపల పెనిమిటి దగ్గర పడుకొంటుంది.

ఆ రోజు ఓ రాత్రివేళ లోపలి కడుగు పెడితే పెనిమిటి నిద్రపోకుండా గుడ్లు తెరిచి పైకి చూస్తున్నాడు.

''ఏటా సూపు? నిలువు గుడ్లేసుకుని?''

''కట్నం డబ్బులు కూడకపోతే, సిన్నమ్మి పెళ్ళాగిపోతే పాపం అరికెంత అగుమానమే?''

''ఏటిందాకట్నించా ఊసు ఒదల్నేదా సువ్వు!''

''ఎలా ఒదలగల్నే! సిన్నమ్మి సక్కగా అదేదో సినీమాలో సయంటూ ఆటాడతాది చూశావా? ఆ హీరోయినీలాగుంటది. ఆ సిన్నమ్మి పెళ్ళాగిపోతే ప్రెసిడెంటుగోరి నడుం యిరిగిపోద్దే. ''

"ఇంతకీ ఏం చేద్దాం"

"వానలు పడితే బాగుణ్ణే."

కనకమ్మ పకపక నవ్వింది.

"అయి పడితే అరికేం. మనకి బాగానే వుణ్ణు" అంది.

''మనకి కష్టాలు కొత్త కావు లేవే. సుఖం ఎలాగుంటదో తెలిస్తేగదా కష్టం యెలాంటిదో మనకి తెలీడానికి? ఉన్ననాడు తింటాం. లేనినాడు పస్తుంటాం. మనకి ఏలకి ఏలు నష్టం రాదు కదా?''

''వేలు నోట్లోకి పోకపోతే ఏలు నష్టం వచ్చినట్లే మనకి.''

''అదెలాగవుద్ది? గొప్పోల్ల కష్టాలు గొప్పోల్లవి.''

"ఐతే విప్పుడు గొప్పోల్ల కష్టాలు గట్టెక్కించే ఉపాయం ఆలోసిస్తా కూకో. నాను నిద్దరోతాను'' అంటూ కన్నమ్మ భర్త దగ్గరకు జరిగి తల కింద చేయి పెట్టుకుని అటు తిరిగి పడుకుంది.

ఓ ఐదు నిమిషాలు ముత్యాలు మాట్లాడ లేదు. ఒంటిపొర చీరకీ, ఒదులు రవికకీ మధ్యన చాకిరేవు బానలా నల్లగా మెరుస్తున్న కన్నమ్మ నడుం కేసి చూస్తూ ఊరుకున్నాడు. చేతి వేళ్ళు ఆ నడుంమీద రాస్తూ ఆలోచనలో పడ్డాడు.

''కన్నీ'' అని పిలిచాడు మెల్లగా.

"ఊ'' అంది కన్నమ్మ.

"మాంకాళమ్మకి మొక్కుకోవే. కోణ్ణికోయిస్తానని.''

"ఎందుకు?''

''వానలు పడాలని.''

కన్నమ్మ మొగుడి మాట కాదన లేదు.

"మాంకాళమ్మ తల్లీ! వానలు పడాల. వరిచేలు పండాల. నీ దయ చూపిస్తే వొచ్చే సుక్కురారంవాడు కోణ్ణి కోయిస్తాను" అని మొక్కు-కుంది మొగుడికి వినపడేటట్లు.

ముత్యాలు కూడా కళ్ళు మూసుకొని కనపడని దేవుణ్ణి మనసారా కోరుకున్నాడు వానలు పడాలని, వరిచేలు పండాలని—సిన్నమ్మి పెళ్ళి ఆగిపోకూడదని.

మర్నాడు మధ్యాహ్నం వరకూ అంతా మామూలుగానే ఉంది. సరిగ్గా మధ్యాహ్నం మూడింటికి హఠాత్తుగా 'సురీడు' చల్లబడ్డాక కథ మలుపు తిరిగింది.

అప్పుడు ముత్యాలు చెరువులో ఆహారం వెతుకుతున్న వాడల్లా చెరువుగట్టుకి దూకి కళ్ళకు చెయి అడ్డు పెట్టుకుని ఆకాశంకేసి చూసాడు.

మాడంత మబ్బు సూరీణ్ణి కమ్మేస్తోంది.

గాలి స్తంభించింది.

ఆకాశం ఉరిమింది.

ఓ మెరుపు మెరిసింది.

"మాంకాళమతల్లీ! వానలు పడాల సుక్కురారంవాడు కోణ్ణి కోయిస్తాది కన్ని" సంతోషంగా మొక్కాడు ముత్యాలు. పరుగుపరుగున పొలాలు చేరాడు.

జల్లులు పడ్డాయి. జోరు పుంజుకున్నాయి.

పొలంలో నేల పరవశంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఆబగా దప్పిక తీర్చుకొంటోంది.

ముత్యాలు వర్షంలో తడుస్తున్నాడు ఆనందంతో తబ్బిబ్బవు తున్నాడు. తన మొరను మన్నించిన మాంకాళమ్మకి మనసులో కోటి దణ్ణాలు అర్పించుకుంటున్నాడు.

గంట గడిచింది. చెరువులు నిండాయి. పొలాలు మునిగిపోయాయి. గూడెం మనుషులు నలుగురు ముత్యాలువైపు వానలో తడుస్తూ పరుగు పరుగున వొస్తున్నారు.

''రండి....రండి....కష్టం గట్టెక్కింది. ఇంకో గంట ఈ వర్షం ఆగక పోతే నిన్నమ్మి పెళ్ళి ఆగిపోనట్టే'' వాళ్ళని చేతులెత్తి పిలిచాడు ముత్యాలు.

వాళ్ళు ముత్యాలు మాట వినిపించుకొనేటట్టు లేరు. అంత వర్షంలోనూ వాళ్ళు రొప్పుతున్నారు. ముత్యాలుని రెక్క పుచ్చుకు గుంజారు.

''పదరా....పరిగెట్టరా'' అన్నాడొకడు.

''సూస్తావేం రా.... నీ యిల్లు కూలి పోయిందిరా'' అన్నాడు మరొకడు.

పరుగెట్టబోయి ముత్యాలు నేల కూలి పోయాడు.

వాన పడుతోంది.

శుక్రవారం నాడు —

"వానలు పడితే కోణ్ణి కోయిస్తానని మొక్కుకున్నా. గురుతుందా?" అడిగింది కన్నమ్మ.

ముత్యాలు మాట్లాడలేదు.

''మంచి కోణ్ని కొనుక్కురా. అనక అమ్మోరికి కోపం వస్తే మంచిది కాదు" అంది కన్నమ్మ.

ముత్యాలుకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''అమ్మోరికి పేదలమీద యెప్పుడూ కోపమే గాని, కనికరం లేదేంటే?''

''అమ్మోరికి కనికరం లేకపోడవేటి? ఇల్లు పోతే పోయె పెసిడెంటుగోరి వశువల కొట్టంలో సోటు దొరకనేదా? పెద్దోడు గొడ్ల సాకిరి చేసే జేరానికి ఆ సోటు సూపించింది అమ్మోరు కాదా? ఇప్పుడు కొత్తగా ఒచ్చిన కష్టం ఏటుంది?'' కన్నమ్మ మొగుడిమీద కన్నెర్ర చేసింది.

''అంతే నంటావా?'' అనడిగి, ''అంతే ...మరంతే'' అని కళ్ళు తుడుచుకుని లెంపలేసుకున్నాడు ముత్యాలు.

వానలు కురిసినందువల్ల దొరికిన ఆ నాలుగు కోజుల కూలి డబ్బుల్ని భద్రంగా తలపాగాలో దాచుకుని, కోడి కొనే ప్రయత్నంలో సంతకి బయల్దేరాడు.

మొత్తానికి ప్రెసిడెంటుగారి కష్టం గట్టెక్కుతుందని వాడికి సంతోషంగానే వుంది.